క్లుప్తంగా

ముగిసిన గౌరీ ఉత్సవాలు



గౌరమ్మను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గౌరమ్మ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. బాలికల కోసం హారతి తట్టలు ఉంచి అమ్మవారికి హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ పెన్నానదిలో నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో వాసవీ మాతృమండలి సభ్యులు ఎస్.నాగవల్లి, కీర్తి, తల్లం లత, ఆర్యవైశ్యం సంఘం మహిళలు పాల్గొన్నారు.

‘సమస్యలు పరిష్కరించండి’

తాడిపత్రిటౌన్: సమస్యలు పరిష్కరించాలని తాడిపత్రి పెన్షనర్స్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం పెన్షనర్లు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం నాలుగు డీఆర్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు. ఎన్నికల ముందు కొత్త పీఆర్‌సీ ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటి వరకు కొత్త పీఆర్‌సీ పై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. పాత క్వాంటం అమలు చేస్తామన్న చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ సంఘం సభ్యులు సత్యప్రసాద్‌రెడ్డి, వీరారెడ్డి, అశ్వత్థరెడ్డి, కుళ్లాయిరెడ్డి, రంగయ్య, ఈశ్వరెడ్డి, హనుమంతరెడ్డి, రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ చేయాలి



అరకటివేములలో ఈ-కేవైసీపై ఆరా తీస్తున్న డ్వామా పీడీ సలీమ్‌బాషా

పుట్లూరు: ఉపాధి పథకం కింద పనులకు హాజరయ్యే కూలీలకు ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీమ్‌బాషా సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని కడవకల్లు, సూరేపల్లి, అరకటివేముల, చెర్లోపల్లిలో ఈ-కేవైసీ చేపడుతున్న తీరును క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నిబంధనల మేరకు కూలీల ఈ-కేవైసీ 100 శాతం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూనిస్టుకు సన్మానం



చిన్న కుళ్లాయప్పను సన్మానిస్తున్న గ్రామస్తులు

శింగనమల(నార్పల): నార్పలకు చెందిన కార్టూనిస్టు చిన్న కుళ్లాయప్ప అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో ఈజిప్ట నిర్వహించిన వ్యంగ చిత్రాల్లో ద్వితీయ స్థానం సాధించడంతో ఆదివారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతి ఇంటికీ ఆర్ఎస్ఎస్’

గార్లదిన్నె: ప్రతి ఇంటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్ పరిచయం చేయాలని మారుతి గోవింద ప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని కల్లూరులో స్వయం సేవక్ సంఘ్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. తిరుపతి ప్రిన్సిపాల్ మారుతి, గోవిందప్ప, ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాష్ట్రీ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి కావడంతో ఆర్ఎస్ఎస్ పిలుపు మేరకు చిట్ట చివరి గ్రామంలో కూడా హిందూ ధర్మం కోసం, దేశం కోసం పని చేసే హిందు వులను కలవాలన్నారు. అలాగే కులమత ప్రమేయం లేకుండా హిందుత్వాన్ని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, రవిబాబు, నరేంద్ర, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫయాజ్‌ను కలసిన మక్బూల్ అహమ్మద్



మక్బూల్ అహమ్మద్‌తో ఫయాజ్‌బాషా తదితరులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్‌బాషాతో వైఎస్సార్‌సీపీ కదిరి సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్ ఆదివారం బేటీ అయ్యారు. తాడిపత్రిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన మక్బూల్‌ను ఫయాజ్‌బాషా మర్యాద పూర్వకంగా కలసి తన ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. కార్యక్రమంలో తాడిపత్రికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివారం సీహెచ్‌సీకి సెలవు!

- ప్రతి వారం వైద్య సిబ్బంది గైర్హాజరు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- రోగుల వెతలు వర్ణనాతీతం



తెరచుకోని ఫార్మసీ



వైద్యులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న దృశ్యం



పామిడి కమ్యూనిటీ ఆసుపత్రి

పామిడి: పామిడి కమ్యూనిటీ ఆస్పత్రికి ఆదివారం విధులకు వచ్చేవారే కరువయ్యారు. దీంతో రోగుల వెతలు వర్ణనాతీతంగా మారాయి. ఈ ఆదివారం ఈ ఆస్పత్రికి దిక్కూ..దివానం లేకుండా పోయింది. వైద్యం కోసం రోగులు ఉదయాన్నే ఆస్పత్రి వచ్చారు. రిసిప్షనిస్టు కోసం వేచి చూసినా రాలేదు. దీంతో ఓపీ విభాగం వద్ద రోగులు క్యూ కట్టి వేచి చూసి సిబ్బంది రాకపోయేసరికి వెనుదిరగాల్సిన దుస్థితి. వచ్చిన ఓ డాక్టర్ సైతం మేడ గదిలో విశ్రాంతికే పరిమితమయ్యారు. విధులకు హాజరైన ఒక్క నర్సే అన్నీ తానై వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎమర్జెన్సీ కేసులకు మినహా తాను కిందకు రానని డాక్టర్ చెప్పడం విడ్డూరం. ఒక వేళ నర్సుకు చూపించుకుని మందులు తీసుకుంటామంటే సైతం ఫార్మసీ తెరచుకోని పరిస్థితి. దీంతో చేసేదేమిలేక రోగులు ఇంటి దారి పట్టడం గమనార్హం. కూటమి ప్రభుత్వ పాలనలో వైద్యం అటకెక్కిందనడానికి ఇదో నిలువెత్తు నిదర్శనం. ఈ కమ్యూనిటీ ఆస్పత్రికి పామిడితో పాటు శింగనమల, గార్లదిన్నె, పెద్దవడుగూరు, యాడికి మండలాల నుంచి రోగులు నిత్యం వచ్చి వెళ్తుంటారు. అలాంటి ఆసుపత్రికి అతీ గతీ లేకుండా పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు భరోసా ఇచ్చేలా రూ.5.80 కోట్లతో నిర్మించిన ఈ ఆస్పత్రికి దిక్కూ..దివానం లేకుండా పోవడంపై రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తీసుకుని వైద్యసేవలు సక్రమంగా అందేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.



రిసిప్షన్ వద్ద వేచి ఉన్న రోగులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ విస్తృతంగా కృషి చేయాలని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రజలకు చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి, వాటిని అమలు పరచకుండా సమస్యలపై ప్రశ్నించిన వారిపై కేసులు బనాయిస్తున్నారన్నారు. కేసులకు ఎవరూ భయపడొద్దన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎవరూ అధైర్య పడొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ విస్తృతంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి సత్య నారాయణరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, శింగనమల, నార్పల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు అధ్యక్షులు పూల ప్రసాద్, ఎల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, ఖాద్‌వలి, సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, ముసలన్న, నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చికెన్ నారాయణస్వామి, నియోజక వర్గం అనుబంధ సంఘాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

గుంతకల్లు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి గ్రామ కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని ఓబుళాపురం గ్రామ పంచాయతీలోని మైనాపురానికి చెందిన వైఎస్సార్‌పీ గ్రామ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు, పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీ సభ్యులు చేపడుతున్న చర్యలు తదితర విషయాలను ఆయనకు వివరించారు. మైనాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు తిమ్మప్ప, రైతు విభాగం అధ్యక్షుడు ధనంజయ, యువజన విభాగం అధ్యక్షుడు ఆదినారాయణ తదితరులు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌తో మాట్లాడుతున్న మైనాపురం గ్రామ కమిటీ సభ్యులు

ఆటోడ్రైవర్లను మోసం చేసిన ‘కూటమి’

గుంతకల్లుటౌన్: ఆటోడ్రైవర్లను కూటమి ప్రభుత్వం నిట్టనిలువునా మోసం చేసిందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు విమర్శించారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో భగత్ సింగ్ ఆటో యూనియన్ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయడం వల్ల ఆటో నడుపుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. ఆటోడ్రైవర్ సేవలో..అనే కార్యక్రమం కింద ప్రతి ఒక్క ఆటోవాలాకు రూ.15 వేల చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం గుంతకల్లు నియోజకవర్గంలో 8 వేల మంది డ్రైవర్లు ఉండగా, కేవలం 1,747 మంది డ్రైవర్లకు సాయమందించడం సిగ్గుచేటన్నారు. లైసెన్సు కలిగిన ప్రతి ఆటోడ్రైవర్‌కు ఈ పథకాన్ని వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్‌కె.బాషు, తిమ్మప్ప, లోకా, రాజు, నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి నాగరాజు

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించారు. మొదటగా అంబేడ్కర్ చిత్ర పటంతో గ్రామసచివాలయం నుంచి డప్పులతో ఊరేగింపుగా బయలుదేరి బస్టాండ్ సర్కిల్లో అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లారు. అక్కడ కేక్ కట్ చేసి, గ్రామ ప్రజలు, దళిత సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మాజీ సర్పంచు రామన్న అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విగ్రహ దాత, సర్పంచు శివాంజనేయులు, అంబేడ్కర్ కమిటీ సభ్యులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



బూదేడులో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్రికెట్ టోర్నీ విజేత రాయలచెరువు జట్టు

యాడికి: దసరా పండుగను పురస్కరించుకుని యాడికి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వైపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. మండల కేంద్రంలోని వేములపాడు రహదారిలో ఉన్న మార్కెట్ యార్డులో జరిగిన టోర్నమెంట్‌లో మొత్తం 72 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పెద్ద వడుగూరు జట్టుపై రాయలచెరువు జట్టు విజయం సాధించింది. విన్నర్ రాయలచెరువు జట్టు సభ్యులకు రూ.40 వేలను నీలూరు ప్రసాద్, బేల్దారి బాలకృష్ణ అందజేశారు. రెండో బహుమతిని పెద్దవడుగూరు జట్టుకు అబ్దుల్ రజాక్ రూ.30వేలు, మూడో బహుమతిని పెద్దపప్పూరు జట్టుకు రూ.20 వేలను కడ్డీల ముత్యాలు, విశ్వం, శేఖర్ అందజేశారు. నాలుగో బహుమతి యాడికి జట్టుకు తిరుమల ఎలక్ట్రికల్స్ మోహన్ రెడ్డి రూ.10వేలను అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా పెద్దపప్పూరు నరేష్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రాయలచెరువు శేఖర్, బెస్ట్ బౌలర్‌గా యాడికి అమర్‌నాథ్ ఎంపిక కావడంతో..పారడైజ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం ఇలాహి, రంగస్వామి ట్రోఫీలను అందజేశారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు

గుంతకల్లు: మండలంలోని నాగసముద్రం-పామిడి రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు నాటడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. గుంతకల్లు-నాగసముద్రం-పామిడి మార్గం సింగల్ రోడ్. జిల్లా కేంద్రం అనంతపురానికి వెళ్లడానికి కొన్ని కి.మీలు ఆదా కావడంతోపాటు సమయం కూడా కలిసి వస్తుందని వాహనాదారులు ఈ మార్గం గుండా వెళ్తుంటారు. అసలే సింగల్ రోడ్ కావడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ బాగానే పెరిగింది. దీనికి తోడు విద్యుత్ అధికారులు గుంతకల్లు-నాగసముద్రం మార్గంలో రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు నాటుతున్నారు. రోడ్డుకు కనీసం నాలుగు మీటర్ల దూరం వేయాలని నిబంధనలున్నా.. రోడ్డుకు అర్ధ అడుగు దూరంలోనే స్తంభాలు నాటారు. అసలే సింగల్ రోడ్ కావడంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు చోటు చేసుకోనే అవకాశం ఉందని నాగసముద్రం గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గుంతకల్లు-పామిడి మార్గం డబుల్ రోడ్డు మంజూరైంది. అయితే ప్రభుత్వం మారిపోవడంతో డబుల్ రోడ్డు ఊసే లేకుండా పోయిందన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డుకు నాలుగు మీటర్లు దూరంలో విద్యుత్ స్తంభాలు మార్చాలని గ్రామస్తులు పుల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, విశ్వనాథ్, మునిస్వామి తదితరులు విజ్ఞప్తి చేశారు.



రోడ్డుకు ఆనుకుని నాటిన విద్యుత్ స్తంభాలను చూపుతున్న గ్రామస్తులు

గంట చర్చిలో కృతజ్ఞత పండుగ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని భాగ్యనగర్‌లో ఉన్న గంట చర్చిలో ఆదివారం కృతజ్ఞత పండుగను ఘనంగా నిర్వహించారు. కృతజ్ఞత అర్పణల పండుగ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల నుంచి వచ్చిన గురువు రెవరెండ్ మేకల రాజేంద్రబాబు దేవుని వాక్యాన్ని, సందేశాన్ని వినిపించారు. దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పాటలు పాడారు. చర్చి గురువులు ఐఎండీ.ప్రసాదరావు,పసన్నబాబు, చర్చి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చర్చీల్లో ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. విశ్వాసం లేకుండా దేవుడికి ఇష్టుడై ఉండుట అసాధ్యమన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



గుంతకల్లులోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

మున్సిపల్ అధికారుల వేధింపులు

- సచివాలయ ఉద్యోగుల బేజారు

గుత్తి: గుత్తి మున్సిపల్ అధికారులు వైఖరితో సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది బేజారవుతున్నారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. ఏ కారణం లేకపోయి ఏదో ఒకటి అనడం పరిపాటిగా మారిపోయిందని సచివాలయ ఉద్యోగులు మథనపడుతున్నారు. బయటకు చెప్పితే ఇంకా వేధిస్తారనే భయంతో లోలోపల కుమిలిపోతున్నారు. మూడు రోజుల క్రితం సచివాలయంలో వీఆర్ఓగా పని చేస్తున్న ఓ యువతిని అకారణంగా మున్సిపల్ అధికారి ఇష్టానుసారం మాట్లాడాడు. ఈ విషయాన్ని ఆ యువతి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది. తహసీల్దార్ వెంటనే సంబంధిత మున్సిపల్ అధికారిపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. లీవ్‌ల కోసం వెళితే గంటల తరబడి మున్సిపల్ కమిషనర్ కార్యాలయం బయట వేచి ఉండాల్సి వస్తోందని పలువురు సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె నోటీసు ఇవ్వడానికి వెళ్లినా చులకనగా చూస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్న విషయాన్ని త్వరలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సచివాలయ ఉద్యోగులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వైఖరిని మార్చుకోవాలని సచివాలయ ఉద్యోగులు కోరారు.



గుత్తిలోని 11వ సచివాలయం

చెరువు, కుంటలకు జలకళ



నీటితో నిండిన గుత్తి చెరువు

గుత్తి: గుత్తి చెరువుతో పాటు వక్కల కుంట, దిడ్డి కుంట, తురాబ్ షా కుంటలు నీటితో నిండిపోయాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువుతో పాటు కుంటల్లో సమృద్ధిగా నీరు చేరింది. ఐదారు సంవత్సరాల తర్వాత కుంటలు, చెరువు నిండటంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉంటే బోర్లలో భూగర్భ జలాలు పెరిగి సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని ప్రజలు సంతోష పడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మహబూబ్ సుభాని షంషీర్



గుర్రంపై షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక సత్యనారాయణపేటలోని హజరత్ మహబూబ్ సుభాని 53 ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున షంషీర్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలతో అలంకరించిన షంషీర్‌ను గుర్రంపై ఉంచి మేళాతాళాల నడుమ సత్యనారాయణపేట, సంతామార్కెట్, పాత ఊరు ఏరియాల్లో ఊరేగించారు. భక్తులు షంషీర్‌ను కొలువుదీర్చిన గుర్రం కాళ్లపై బిందెలతో దారిపొడువునా నీళ్లు పోస్తూ భక్తిని చాటుకున్నారు. అనంతరం యథావిధిగా షంషీర్ దర్గాకు చేరుకుని మహబూబ్ సుభాని సమాధిపై కొలువుదీర్చారు. మధ్యాహ్నం జియారత్ కార్యక్రమంలో భాగంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

థియేటర్‌లోకి మద్యం బాటిళ్లు, రాళ్లు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్‌లోకి రెండు రోజులుగా సెకెండ్ షో ఇంట్రవెల్ సమయంలో తాగుబోతులు మద్యం బాటిళ్లు, రాళ్లు విసురుతున్నారు. పైగా ప్రశ్నించిన థియేటర్ నిర్వాహకులపై దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో థియేటర్ నిర్వాహకులు రాజేష్, రాజు ఆదివారం సీఐ రామారావుకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కాలనీకి చెందిన సాయి, కిరణ్, సంతోష్, రాము తదితరులు సుమారు పది మంది రాత్రి అయిందంటే మద్యం సేవించడం, మద్యం బాటిళ్లను, రాళ్లను విసరడం పరిపాటిగా మారింది. థియేటర్ నిర్వాహకులు రాజేష్, రాజు ప్రశ్నించడంతో వారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో థియేటర్‌లో పని చేయడానికి సిబ్బంది జంకుతున్నారు. ఇప్పటికే కొంత మంది థియేటర్‌లో పని చేసే సిబ్బంది పనులు మానుకున్నారు. ఈ క్రమంలో విసుగు చెందిన నిర్వాహకులు పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

తాడిపత్రిటౌన్: పాత కోటకు చెందిన అన్నదమ్ములు రవి, రామాంజనేయులు ఆస్తి తగాదా విషయమై పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఘర్షణ పడ్డారు. ఒకరిపై ఒక్కరు దాడి చేసుకోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు.

మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి కిందపడిన యువకుడు



గాయపడిన మహమ్మద్ హుస్సేన్

గుంతకల్లు: మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి కింద పడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లు పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న మహమ్మద్‌హుస్సేన్‌ను పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కొనకొండ్ల రోడ్డులోని భీమా గార్డెన్ సమీపంలోని ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి) గోడపై కూర్చొని మద్యం సేవిస్తూ... మత్తులో జారుకుని అదుపు తప్పి దాదాపు బ్రిడ్జిపై నుంచి కిందకు పడ్డాడు. తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్న యువకుడిని అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాలో నేడు, రేపు అంతరాయం

పుట్లూరు: తాడిపత్రి, పుట్లూరు మండలాల్లో సోమవారం, మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 220 కేవీ బోయరెడ్డిపల్లి వద్ద తాడిపత్రి ఫీడర్ ప్యానెల్ మార్పు చేస్తుండటంతో రెండు రోజుల పాటు మరమ్మతులు చేపడుతున్నారు. మరమ్మతుల నేపథ్యంలో 220 కేవీ తాడిపత్రి, 132 కేవీ కోమటికుంట్ల పరిధిలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు.